
యోగాలో మెలకువలు నేర్చుకుంటున్న విద్యార్థులు


స్క్రీన్ ద్వారా పాఠాలు వింటున్న విద్యార్థులు


విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ఆర్‌ఓ వాటర్

ఇది కదా అభివృద్ధి

- నాడు-నేడులో ప్రైవేటుకు దీటుగా సౌకర్యాల కల్పన
- చిన్ననాటి నుంచి డిజిటల్ బోధన
- ఆహ్లాదకర వాతావరణం

సకల వసతుల ఒడి.. సర్కారు బడి

సర్కారు బడులు అనగానే కూలుతున్న భవనాలు, పెచ్చులూడిన గోడలు, విరిగిపోయిన తలుపులు.. ఊడిపోయిన కిటికీలు.. కూర్చోవడానికి వీలులేని బెంచీ లు.. ఆరు బయటే మూత్రవిసర్జన.. గత పాలకుల నిర్లక్ష్యంగా ప్రభుత్వ పాఠశాలల తీరు ఇది.

2019లో అధికారంలోకి వచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు బడులకు కొత్త అర్థం తీసుకొచ్చారు. విద్యారంగానికి అధిక ప్రాధాన్యమిస్తూ సీఎం జగన్ తీసుకున్న విప్లవాత్మక నిర్ణయాలతో కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు సకల వసతులతో అందంగా ముస్తాబయ్యాయి.


రన్నింగ్ వాటర్ సదుపాయంతో నూతనంగా నిర్మించిన మరుగుదొడ్లు

మల్కాపురం: ప్రైవేట్ స్కూల్ మాదిరిగా విద్యార్థులను బట్టీ పట్టించడం ఉండదు. కార్పొరేట్ అన్న పేరుతో అధిక ఫీజులు వసూలు చేయడం ఉండదు. స్కూల్ యూనిఫామ్, బెల్ట్, పుస్తకాలు, బిల్డింగ్ ఫండ్ అని విద్యార్థుల తల్లిదండ్రులను పీడించడం కనిపించదు. అక్కడ ప్రతి పేద విద్యార్థికి లభించేది ఆహ్లాదకరమైన వాతావరణంలో చక్కటి బోధన మాత్రమే. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నాడు–నేడు పథకం కింద సర్కారు పాఠశాలలను సకల వసతులతో ఆధునికీకరించింది. ఇందుకు 61వ వార్డు మల్కాపురం జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలే నిదర్శనం. మల్కాపురం జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలను నాడు– నేడు పథకం తొలి దశలో రూ.25 లక్షలతో ఆధునికీకరించారు. మరిన్ని సౌకర్యాల కోసం మరో రూ.1.20 లక్షలు ఖర్చు చేశారు. ఐదు తరగతి గదులు ఉండే ఈ పాఠశాలలో ప్రస్తుతం 8 తరగతి గదులు సమకూర్చారు. నాడు 180 మంది విద్యార్థులు ఉండగా.. వైఎస్ జగన్ ప్రభుత్వం కల్పించిన సౌకర్యాల కారణంగా ప్రస్తుతం ఈ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 213 మందికి చేరింది. 2021కి ముందు శిథిలావస్థలో ఉండే ఈ పాఠశాల నేడు సకల హంగులతో కళకళలాడుతోంది.


విశాలమైన తరగతి గదిలో పాఠాలు వింటున్న విద్యార్థులు

విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది..



మా పాఠశాలలో పిల్లలను చేర్పించేందుకు తల్లిదండ్రులు ఇష్టపడే వారు కాదు. నేడు ఆ పరిస్థితి లేదు. మా పాఠశాలలో పిల్లలను చేర్పించేందుకు ఎంతో ఆసక్తి కనబరుస్తున్నారు. దీని బట్టి జీవీఎంసీ పాఠశాల ఏ స్థాయిలో అభివృద్ధి చెందిందో అర్థం చేసుకోవచ్చు.

– హరికృష్ణ, ప్రధానోపాధ్యాయుడు, మల్కాపురం ప్రాథమిక పాఠశాల

ఇంతటి అభివృద్ధిని ఊహించలేదు



ఒకటో తరగతి నుంచి ఇదే పాఠశాలలో చదువుతున్నాను. ఒకప్పుడు రంగులు వెలిసి, కనీస మరుగుదొడ్లు సౌకర్యం లేకుండా తమ పాఠశాల ఉండేది. జగన్ మామ అధికారంలోకి వచ్చిన తరువాత మా పాఠశాల రూపురేఖలను మార్చేశారు. ఇంతలా అభివృద్ధి చెందుతుందని ఊహించ లేదు.

– త్రివేణి, 5వ తరగతి విద్యార్థిని

గర్వంగా ఉంది



గతంలో ఉపాధ్యాయుల సంఖ్య అంతంత మాత్రంగా ఉండేది. అన్ని తరగతుల విద్యార్థులకు ఆ ఉపాధ్యాయులే బోధించేవారు. ప్రస్తుతం ప్రతి సబ్జెక్ట్‌కు ఒక టీచర్‌తో పాటు, ఆట పాట నేర్పించేందుకు పీఈజీ ఉపాధ్యాయులు కూడా ఉన్నారు. స్క్రీన్ ద్వారా చక్కటి డిజిటల్ బోధనలు కూడా చేస్తున్నారు. చాలా గర్వంగా ఉంది.

– తనూష్‌కృష్ణ, 5వ తరగతి విద్యార్థి

చక్కటి బోధన



మా పాఠశాలలో చక్కటి బోధనలతో పాటు, నాణ్యమైన మధ్యాహ్నం భోజనం అందుతోంది. గతంలో తరగతి గదిలో కూర్చోవడానికి సరైన బల్ల ఉండేది కాదు. నేడు ఎంతో సౌకర్యవంతంగా ఆధునిక బెంచీలు ఏర్పాటు చేశారు. అన్ని వసతులతో మా పాఠశాలను అందంగా తీర్చిదిద్దారు.

– జ్యోత్స్న, 4వ తరగతి విద్యార్థిని

జగన్ మామకు రుణపడి ఉంటాం..

మాకు మంచి బోధన కాదు.. మేము పాఠశాలకు వచ్చినందుకు మా తల్లుల ఖాతాల్లో అమ్మఒడి కింద రూ.15 వేలు ఇస్తూ జగన్ మామ ఆర్థికంగా ఆదుకుంటున్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా సౌకర్యాలు కల్పించారు. మంచి భోజనం పెడుతున్నారు. పాఠశాలలో ఆహ్లాదకర వాతావరణం ఉండడంతో ఇంటికి వెళ్ల బుద్ధి కావడం లేదు. సీఎం జగన్ మామ వల్ల మేము బాగా చదువుకుంటున్నాం. ఆయనకు మేమంతా రుణపడి ఉంటాం.

– నిహాల్‌కుమార్, 4వ తరగతి విద్యార్థి

క్లుప్తంగా

పదోతరగతి ప్రశ్న పత్రాలు వచ్చేశాయి


ప్రశ్న పత్రాలను వ్యాన్ నుంచి దింపుతున్న సిబ్బంది

మల్కాపురం: ఈ నెల 18వ తేదీ నుంచి నిర్వహించనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించి ఏర్పాట్లు చేస్తున్నారు. ములగాడ మండల పరిధిలో గల పలు ప్రభుత్వ,ప్రైవేట్ పాఠశాలలో సెంటర్లు ఏర్పాటు చేస్తున్నారు. పరీక్షకు హాజరు కాబోతున్న విద్యార్థుల కోసం అవసరమైన ప్రశ్న పత్రాలు బుధవారం మల్కాపురం పోలీస్‌స్టేషన్‌కు వచ్చాయి. ఎంఈవో త్రినాథ్ దగ్గరుండి వాటిని సేకరించి,స్టేషన్‌లో భద్రపరిచారు. ములగాడ మండల పరిధిలో మల్కాపురం,శ్రీహరిపురం,గాంధీగ్రామ్ ప్రభుత్వ పాఠశాలలతో పాటు శ్రీహరిపురంలోని భాష్యం, సరస్వతి ప్రైవేట్ పాఠశాలల్లో సెంటర్లు ఏర్పాటు చేశారు. సుమారు 1100 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజానికి కృషి


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ నరేష్‌కుమార్, కోనాడ సుదర్శన్

కంచరపాలెం: ప్లాస్టిక్ రహితంగా విశాఖను మార్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జీవీఎంసీ వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ ఇ.ఎస్.వి.నరేష్‌కుమార్ పిలుపునిచ్చారు. సివిల్ అండ్ లీగల్ రైట్స్ ప్రొటెక్షన్ కమిటీ ఆధ్వర్యంలో జీవీఎంసీ ప్రజారోగ్య శాఖ అనుమతితో నిర్వహించనున్న అవగాహన కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్‌ను బుధవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఆయన ఆవిష్కరించి, మాట్లాడారు. నగరాన్ని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దే దిశగా కమిటీ చేస్తున్న ఈ ప్రయత్నం అభినందనీయమన్నారు. జీవీఎంసీ 98 వార్డుల్లో చిరు వ్యాపారులు, హోటళ్లు, పాఠశాలలు, రెస్టారెంట్ యజమానులకు ప్లాస్టిక్ రహిత సమాజంపై అవగాహన కల్పించేందుకు తలపెట్టిన ఈ కార్యక్రమం జయప్రదం కావడానికి వార్డు శానిటరీ సిబ్బంది సహాయ సహకారాలను అందిస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సంస్థ చైర్మన్ జెస్సీ డెఫోర, కార్యదర్శి కోనాడ సుదర్శన్, కోన రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆనంద్‌కుమార్ సొంత నిధులతో పలువురికి పింఛన్


పింఛన్ నగదు అందజేస్తున్న పిల్లా రమాకుమారి


63వ వార్డులో పింఛన్ నగదు అందిస్తున్న పిల్లా రమాకుమారి

మల్కాపురం: సాంకేతిక సమస్య కారణంగా ప్రభుత్వ పింఛన్ మంజూరుకాని ఐదుగురికి వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ తన సొంత నిధులతో పింఛన్లు అందిస్తున్నారు. దీనిలో భాగంగా బుధవారం 61వ వార్డు పరిధిలో ఐదుగురికి ఆనంద్‌కుమార్ సమూర్చిన సొంత నిధులతో ఐదుగురికి రూ.3 వేల చొప్పున యలమంచిలి మున్సిపాలిటీ చైర్ పర్సన్ పిల్లా రమాకుమారి అందజేశారు.

61వ వార్డు మరిడిమాంబ కల్యాణమండపం వద్ద జరిగిన కార్యక్రమంలో రమాకుమారి మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి పింఛన్ వచ్చే వరకు ప్రతి నెలా వీరికి వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ సమక్షంలో పింఛన్ ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ,గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

63వ వార్డులో..

సింధియా: జీవీఎంసీ 63వ వార్డు పరిధిలోని 9 మందికి వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ సొంత నిధులతో సమకూర్చిన పింఛన్ నగదును యలమంచిలి మున్సిపాలిటీ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి బుధవారం లబ్ధిదారులకు అందజేశారు. వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి పిలక రామ్మోహనరెడ్డి, నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మహాశివరాత్రికి ప్రత్యేక బస్సులు

మల్కాపురం: ఈ నెల 8న మహాశివరాత్రి సందర్భంగా అప్పికొండ వద్ద గల సోమేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే భక్తుల సౌకర్యార్థం గాజువాక ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నారు. శుక్రవారం ఉదయం నుంచి 9వ తేదీ వరకు ఈ బస్సులు నడపనున్నట్టు గాజువాక డిపో అధికారులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.గాజువాక డిపో,కొత్తగాజువాక,పాతగాజువాక,కూర్మన్నపాలెం,అగనంపూడి,మల్కాపురం,సింధియా తదితర ప్రాంతాల నుంచి ఈ ప్రత్యేక ఆర్టీసీ సర్వీసులు ప్రతి అర గంటకు ఒకటి తిరుగుతాయని పేర్కొన్నారు. భక్తులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిపో అధికారులు కోరారు.

కల్యాణ మండపం అదనపు గదుల ప్రారంభం

మల్కాపురం: జింక్ ఆంజనేయస్వామి ఆలయం ఆవరణలోని కల్యాణమండపంలో నిర్మించిన అదనపు గదులను యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్, పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ సోదరి పిల్లా రమాకుమారి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కల్యాణ మండపానికి అదనపు గదులు కావాలని భక్తులు, ధర్మకర్తల మండలి విజ్ఞప్తి మేరకు ఆనంద్ కుమార్ తన సొంత నిధులతో అదనపు గదులు నిర్మించారని చెప్పారు. పరుల సేవలో తమ కుటుంబం ఎప్పుడు ముందు వరుసలో ఉంటుందన్నారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ లావణ్య,ఆలయ చైర్మన్ గంట్యాడ కృష్ణమూర్తి, 61వ వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ,ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

పార్కుల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ

- జీవీఎంసీ అదనపు కమిషనర్ విశ్వనాథన్
- 52వ వార్డులో ఆకస్మిక తనిఖీలు
- పర్యటనలో పాల్గొన్న డిప్యూటీ మేయర్ శ్రీధర్


శాంతినగర్ పార్కును పరిశీలిస్తున్న అదనపు కమిషనర్ విశ్వనాథన్

విశాఖ విద్య: నగర వాసులకు ఆహ్లాదకరమైన వాతావరణం అందించేలా పార్కులను అభివృద్ధి చేస్తున్నట్టు జీవీఎంసీ అదనపు కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ చెప్పారు. 52వ వార్డులో బుధవారం జీవీఎంసీ జోన్–5 అధికారులు, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్‌తో కలిసి ఆకస్మిక పర్యటన చేశారు. హైవేకు ఆనుకొని ఉన్న గ్రీన్ బెల్ట్‌లో వాకర్స్‌తో కలసి కొద్దిసేపు వాకింగ్ చేశారు. గ్రీన్ బెల్ట్ పార్కు లో ఉదయం వేళ వ్యాయామం చేసే వారితో సందడిగా ఉండడంపై అదనపు కమిషనర్ విశ్వనాథన్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఎలియన్ వాకర్స్ క్లబ్, వుడా కాలనీ అసోసియేషన్ ప్రతినిధులతో మాట్లాడారు. గ్రీన్ బెల్ట్‌లో ఏర్పాటు చేయాల్సిన మౌలిక సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం శాంతినగర్ పార్కు పరిశీలించారు. పార్కుల అభివృద్ధితో ప్రజానీకానికి ఎంతో మేలు జరుగుతుందని, ఆ దిశగా జీవీఎంసీ ద్వారా కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్టు చెప్పారు. గ్రీన్ బెల్ట్, వాకింగ్ ట్రాక్స్, మోడల్ లైటింగ్, సుందరీకరణ పనులు చేపట్టేలా తగిన చర్యలు తీసుకోవాలని, ఇందుకు అవసరమైన నిధులు కేటాయించేలా తగిన ఏర్పాట్లు చేయాలని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ కోరారు. ఈ సందర్భంగా వార్డు పరిధిలో నెలకొన్న సమస్యలు, వాటి పరిష్కారానికి చేపట్టాల్సిన పనులపై వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జోన్–5 కమిషనర్ కృష్ణ, ఈఈ తారా ప్రసన్న రెడ్డి, జోన్–5 డీఈ కె. ఏడుకొండలు, ఎలియన్స్ క్లబ్ అధ్యక్షుడు కొలుసు నాగేశ్వరరావు, వార్డు సచివాలయ సెక్రటరీలు పాల్గొన్నారు.

సామాజిక భవనాలు ప్రారంభం


40వ వార్డులో వ్యాయామశాలను ప్రారంభిస్తున్న రమాకుమారి

సింధియా: జీవీఎంసీ 40వ వార్డు ఏకేసీకాలనీలోని పలు సామాజిక భవనాలను యలమంచిలి మున్సిపాలిటీ చైర్ పర్సన్ పిల్లా రమాకుమారి బుధవారం ప్రారంభించారు. రూ.38.65 లక్షల తో నిర్మించిన శ్రీ నూకాంబిక వెల్ఫేర్ అసోసియేషన్ వ్యాయామశాల, రూ.16.50 లక్షలతో నిర్మించిన అంబేడ్కర్ సామాజిక భవనాన్ని వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావుతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న రోజుల్లో పేద, మధ్య తరగతి ప్రజల కోసం మరెన్నో సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేయనున్నారని చెప్పారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఆడారి ఆనంద్‌కుమార్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. అనంతరం జగనన్న ఇంటి లబ్ధిదారులు సుమారు 212 మందికి రిజిస్ట్రేషన్ పట్టాలు, సాంకేతిక కారణాలతో పింఛన్ అందనివారికి ఆడారి ఆనంద్‌కుమార్ సొంత నిధులతో ప్రతి నెలా అందిస్తున్న పింఛన్ నగదు అందించారు. కార్యక్రమంలో రాంజీ ఎస్సీ సేవా సంఘం సభ్యులు, శ్రీనూకాంబిక రెసిడెన్సీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, వార్డు వలంటీర్లు, నాయకులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్లలో ప్రత్యేక స్పందన


గోపాలపట్నం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు దారునితో మాట్లాడుతున్న ఏసీపీ అన్నెపు నరసింహ మూర్తి


ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఏసీపీ ప్రసాదరావు

గోపాలపట్నం: ఎయిర్‌పోర్టు, గోపాలపట్నం పోలీస్ స్టేషన్లలో బుధవారం ప్రత్యేక స్పందన కార్యక్రమం నిర్వహించారు. గోపాలపట్నం పోలీస్‌స్టేషన్‌లో జరిగిన స్పందనలో వెస్ట్ సబ్ డివిజన్ ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి పాల్గొనగా.. ఓ బాధితుడు వచ్చి తన సమస్యను విన్నవించుకున్నారు. రెండు వారాల్లో సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్‌లో ఏసీపీ ప్రసాదరావు స్పందన కార్యక్రమం నిర్వహించారు. మూ భూతగాదా కేసులు వచ్చాయి. వారికి న్యాయ సలహాలు తెలియజేశారు. కేసు నమోదు చేసి రసీదులు అందజేశారు.

ప్రైవేటీకరణతో కార్మికులకు తీరని నష్టం

కూర్మన్నపాలెం : కేంద్ర ప్రభుత్వం కుట్రపూరిత ఉద్దేశంతో ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరించాలనే ఆలోచనలు చేస్తోందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు ఆరోపించారు. ప్రైవేటీకరణతో కార్మికుల జీవితాలు బలవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారానికి 1119వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొని, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ కార్మికులకు, నిర్వాసితులకు అన్యాయం చేసే స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అంశాన్ని కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని విన్నవించామన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన తీరును మార్చుకుని స్టీల్ ప్లాంట్‌ను ప్రభుత్వరంగంలోనే కొనసాగించాలని, లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కొనక తప్పదన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు చేపట్టండి

- బయాలజిస్ట్ మూర్తి


సిబ్బందికి సూచనలిస్తున్న బయాలజిస్ట్ మూర్తి

మల్కాపురం: జీవీఎంసీ బయాలజిస్ట్ డి.ఎస్.మూర్తి బుధవారం పారిశ్రామిక ప్రాంతంలోని పలు వార్డుల్లో ఆకస్మికంగా పర్యటించారు. తొలుత 60వ వార్డు గుల్లలపాలెంలోని వార్డు శానిటరీ, మలేరియా విభాగం కార్యాలయానికి వచ్చారు. ఆయా విభాగాల అధికారులతో పారిశుధ్యం,మలేరియా నివారణకు తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. దోమల సమస్య అధికంగా ఉందని ఫిర్యాదులు వస్తున్నాయని.. తక్షణమే చర్యలు చేపట్టాలని సూచించారు. ఫాగింగ్ నిబంధనల ప్రకారం చేయాలన్నారు. ద్విచక్ర వాహనంపై కూర్చుని పిచికారీ చేస్తే ఎలా అని సిబ్బందిని ప్రశ్నించారు.ఈ సమస్య పునరావృతం కాకూడదన్నారు. కార్యక్రమంలో మలేరియా విభాగ ఇన్‌స్పెక్టర్ డి.రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు నిత్యావసరాల పంపిణీ


బియ్యం అందజేస్తున్న పద్మావతి

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు కాకానినగర్‌లో వైఎస్సార్ సీపీ నాయకురాలు మేడపురెడ్డి పద్మావతి ఆధ్వర్యంలో బుధవారం వృద్ధులకు బియ్యం, ఇతర నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని ఏటా మూడు రోజులు పాటు ప్రత్యేక కార్యక్రమా లు చేపడుతున్నట్లు తెలిపారు. స్థానిక మహిళలతో కలిసి కేక్ కట్ చేసి, అందరికీ మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలనే ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలనే లక్ష్యంతో ఇలాంటి కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వరలక్ష్మి, భాను, సత్యవతి, రమా, కవిత, ఝాన్సీ, ధనలత, వాణి, నివేదిత, రమణమ్మ, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

ద్వాదశ జ్యోతిర్లింగాల ప్రదర్శన ప్రారంభం

అగనంపూడి: దేశంలో ప్రసిద్ధ శైవక్షేత్రాలను దర్శించుకునే భాగ్యాన్ని అగనంపూడి బ్రహ్మకుమారీస్ సంస్థ కల్పించడం ఈ ప్రాంతీయుల అదృష్టమని బ్రహ్మకుమారీస్ కాకినాడ జిల్లా ఇన్‌చార్జి రాజయోగిని, బికె రజని అన్నారు. మహా శివరాత్రిని పురస్కరించుకుని అగనంపూడి బ్రహ్మకుమారీస్ సంస్థ (దివ్యజ్యోతి భవనం) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ద్వాదశ జ్యోతిర్లింగాల ప్రదర్శనను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలోనే సుప్రసిద్ధ దేవాలయాల నమూనాలను ఏర్పాటు చేసి, మూడు రోజుల పాటు ఈ ప్రాంతీయులు దర్శించుకునే అవకాశం కల్పించడం సంతోషంగా ఉందన్నారు. విశాఖ ఇన్‌చార్జి రాజయోగిని బికె వేణి , సత్య, విమల, అపరంజి, కోఆర్డినేటర్ సోమేశ్వరి పాల్గొన్నారు.

నేడు యువ ఉద్యోగుల 'తాలి బజావో'

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ యువ ఉద్యోగులు వేతన సవరణపై మరోసారి గళం ఎత్తుతున్నారు. ఇందు కోసం తాలి బజావో కార్యక్రమానికి రూపకల్పన చేశారు. ఉక్కు కార్మికులకు 2017 జనవరి 1 నుంచి వేతన సవరణ జరగలేదు. దీంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న యువ ఉద్యోగులు సత్వర వేతన సవరణ కోసం కార్మిక సంఘాలపై తీవ్రమైన ఒత్తిడి తెచ్చారు. అయినప్పటికీ ఫలితం రాకపోవడంతో యాజమాన్యంపై ఒత్తిడి తెచ్చే కార్యక్రమంలో భాగంగా గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు ఈ కార్యక్రమం చేపట్టనున్నారు. ఉక్కు ఎల్‌డీసీ విభాగం నుంచి ఉక్కు అడ్మిన్ బిల్డింగ్ వరకు ఈ కార్యక్రమం చేపట్టనున్నట్లు వారు ప్రకటించారు.